# పేదవాడి పెళ్ళాం

పక్కలోకి విస్కీ బాటిల్ లాంటి పడుచు లేందే నాకు నిద్రపట్టదు. విస్కీ బాటిల్స్‌ని మార్చినట్టుగానే గర్ల్స్‌ని కూడా మార్చాలి. ఒక్కసారి నా పక్కలోకి వచ్చిన పడుచుతో మళ్ళా పడుకోవాలనిపించదు నాకు. ఐ బిలీవ్ ఇన్ ఛేంజ్.

రోజూ అర్థరాత్రిదాకా క్లబ్బులో కార్డ్సు - రమ్మీ... విస్కీ సిప్ చేస్తూ... ఎస్.పి .గాడి అందమైన పెళ్ళాం కళ్ళల్లోకి మత్తుగా చూస్తూ (ఆమెకేసి చూడటం వరకేగాని ఇంకేమీ చెయ్యటానికి వీల్లేదు. ఎస్.పి. గాడు షూట్‌చేసి పారేస్తాడు.) తర్వాత ఇంటికి... ఇల్లు చేరేటప్పటికి మా నరసింహం... మా ఆఫీసులో ఎల్.డి.సి... నాకు నమ్మినబంటు... నాకోసం వో బ్యూటిఫుల్ బిఛ్‌ని రడీగా ఉంచుతాడు. బిఛెస్‌ని పట్టుకరావటంలో మా నరసింహాన్ని మించినవాడు లేడు.

నేను రెవిన్యూ డిపార్టుమెంట్‌లో వో పెద్ద ఆఫీసర్ని, నా చేతినిండా కరెన్సీ నోట్సు - చాలామంది ఉద్యోగస్తులకు నెలకొకసారే జీతం వస్తుందట, నాన్‌సెన్స్ - నాకు ప్రతిరోజూ జీతం వస్తుంది. మా ఆఫీసుకు నాతో ఏదో పనిఉండి వచ్చే ప్రతివాడూ - నేను అడక్కుండానే నాకాళ్ళ మీద వందలకు వందల కరెన్సీనోట్సు కుమ్మరించి పోతుంటారు. డబ్బు చేదా? డబ్బు యిస్తానంటే వద్దనే మూర్ఖులు ఈ ప్రపంచంలో ఉంటారంటే నేను నమ్మలేని విషయం. డబ్బు విలువేమిటో నాకు తెలుసు. కరెన్సీ నోట్సుని ఆనందంగా అనువదించుకోవటమెలాగో నాకు తెలుసు. ఈ ప్రపంచంలో డబ్బుతో కొనలేనిదంటూ ఏదీ లేదని నా నమ్మకం.

నాకింకా పెళ్ళికాలేదు. మార్కెట్‌లో నేను ఎక్స్‌పెక్టు చేసినంత రేటు పలకటం లేదు. మొన్ననే 60 వేలు యిస్తామని వచ్చారు. నేను లక్షకు తగ్గనన్నాను. లక్ష తెస్తే చాలు, అమ్మాయి ఎలా ఉన్నా నాకు ఫరవాలేదు. పెళ్లాం అందంగా ఉండాలనుకోవటం చాలా ఫూలిష్‌నెస్. మన పెళ్ళాంగాదు అందంగా వుండాల్సింది, ఎదుటివాడి పెళ్ళాం. ముఖ్యంగా పేదవాడి పెళ్లాం అందంగా వుండాలి. మన పెళ్లాం అందంగా ఉండక పోవటం మనకు చాలా సేఫ్టీ. ఎవడూ కన్నెత్తి చూడడు. మనకు బోలెడు వర్రీ తప్పుతుంది.

ఆ రోజు రాత్రి పదిగంటలకు క్లబ్బు నుండి ఇంటికి వస్తున్నాను. జీపును అరవై మైళ్ల స్పీడులో నడుపుతున్నాను. అంతకంటె తక్కువ నడపటం నాకు చేతకాదు. అప్పుడే ఫస్టుషో వదిలినట్టున్నారు. జనం గుంపులు గుంపులుగా రోడ్లమీద

నడుస్తున్నారు. సడెన్‌గా జీపుకు బ్రేక్ వేయాల్సివచ్చింది. దంపతులు కూర్చున్న ఓ రిక్షా అడ్డమొచ్చింది. ఫ్లడ్‌లైట్స్ వెలుగులో ఆ రిక్షాలో కూర్చున్నవాళ్ళెవరో స్పష్టంగా కన్పించారు. నా కన్నుల్ని నేను నమ్మలేకపోయాను. మా ఆఫీసు అటెండర్ లక్ష్మయ్య, వాడి పక్కన వో అందమయిన పడుచు - ఆ పిల్ల మాంచి సెక్సీగా ఉంది. వర్కింగ్ క్లాసు స్త్రీలలోనే నిజమయిన సెక్స్ ఉంటుంది. మిడిల్‌క్లాస్, అప్పర్‌క్లాస్ స్త్రీలు కేవలం బయట్నించి చూడడానికే- వర్కింగ్‌క్లాసు స్త్రీలు మంచి పుష్టిగా ఉంటారు. ఆరోగ్యంగా ఉంటారు. మన కోరికల ఉధృతాన్ని రెచ్చగొట్టి, మననే అలసి సొలసిపోయేట్టు చేసే చేవ, జిగి వాళ్ల శరీరాల్లో ఉంటాయి.

రిక్షాలో లక్ష్మయ్య పక్కన కూర్చున్న పడుచు వాడి పెళ్ళామేనా? పుష్టిగా- ఆరోగ్యంగా ఉండటమే కాదు చాలా అందంగా కూడా ఉంది. మగవాణ్ణి ఛాలెంజ్ చేసే అందమది. యే అప్పర్‌క్లాసు ఆడదానికీ తీసిపోనంత సున్నితంగా కూడా ఉంది.

జీపు మా యింటిముందు ఆగేవరకు లక్ష్మయ్య పెళ్ళామే నా కళ్ళలో మెదిలింది.

లక్ష్మయ్య మా ఆఫీసులో ఉన్న అటెండర్స్‌లోకల్లా అతి అమాయకుడు. చాలా బేలగా-దీనంగా కన్పిస్తాడు. యే పని చెప్పినా సిన్సియర్‌గా చేస్తాడు. నాకు తెలిసింది వాడికి పెళ్ళి కాలేదనే - కానీ ఈమధ్య చేసుకున్నాడేమో!

జీపు దిగటంతోటే మా ఇంటి దగ్గరుండే నా పర్సనల్ అటెండర్ రంగడ్ని అడిగాను-

"యేరా! లక్ష్మయ్యకి పెళ్ళయ్యిందా?"

"ఔను సార్! ఈమద్దెనే చేసుకున్నాడు"

ఈలవేస్తూ అన్నాను. "చాలా మంచి పిట్టనే పట్టినట్టున్నాడు- ఇందాక రోడ్డుమీద చూసాలే!"

రంగడు కళ్ళు మిటకరిస్తూ అన్నాడు.

"ఔనుసార్ - దానికి అవ్వా అయ్యా ఎవరూ లేరుట. లక్ష్మయ్యకి దూరపు చుట్టమట కూడా. మొన్న లక్ష్మయ్య వాళ్లూరికి పోయినప్పుడు దిక్కుమొక్కు లేక పడివున్న దానికి వీడికి ఆ ఊళ్లోవాళ్ళు ముడిపెట్టారుట"

"ఐసీ" అంటూ బెడ్‌రూమ్‌లోకెళ్ళాను.

రంగడి గుడిసె-లక్ష్మయ్య గుడిసె పక్కపక్కనే ఉంటాయి. వాళ్ళ గుడిసెలు నా బంగళాకి చాలా దగ్గర్లోనే ఉంటాయి, రేపు నరసింహంతో చెప్పానంటే... లక్ష్మయ్యగాడి పెళ్లాన్ని తెచ్చి క్షణంలో నా బెడ్‌రూమ్‌లో పడేస్తాడు.

ఆ తెల్లారి ఆఫీసుకు వెళ్ళటంతోటే నరసింహాన్ని పిలిపించాను.

"లక్ష్మయ్యగాడికి పెళ్ళయినట్టు నాకు చెప్పలేదేమిటి?"

"నాకు నిన్ననే తెలిసింది సార్ పెళ్ళి చేసికున్నట్టు"

"వాడి భార్యను చూసావా?"

"లేదు సార్... ఇంకా చూళ్ళేదు"

"యేం చేస్తున్నావింకా వాడి భార్య అప్సరసలాగుంటుంది తెలుసా? దాన్ని చూసాక రాత్రంతా నిద్రపోలేకపోయాను"

నా భావాన్ని గ్రహించాడు నరసింహం.

"నిజంగానా సార్... అంత బావుంటుందా సార్" అన్నాడు.

ఈలవేస్తూ కన్నుగీటుతూ అన్నాను.

"చాలారోజులు ఆగలేనోయ్. వారం రోజులు టైమిస్తున్నాను– చాలా?"

"వో–కే సార్... అంతకంటె ముందుగానే మీ కోరిక తీర్చటానికి ప్రయత్నిస్తాను" నరసింహం.

"గో ఎహెడ్..." పర్సుతీసి వందరూపాయల నోటు బయటకు లాగి నరసింహం చేతిలో పడేస్తూ 'చాలా' అన్నాను.

"హిహిహి ప్రస్తుతానికి చాలుసార్" అసహ్యంగా పళ్ళికిలిస్తూ నరసింహం వెళ్ళిపోయాడు.

పెళ్ళి చేసుకున్నాక లక్ష్మయ్యలో చాలా మార్పు కన్పించింది. వాడిదివర కెప్పుడూ దీనంగా నిద్రమత్తుతో జోగుతూ కన్పించేవాడు. ఎప్పుడూ దీనంగా, దిగులుగా, ఏదో పోగొట్టుకున్నట్టుగా, ఏ బ్రహ్మదేవుడి పొరపాటువల్లో ఈ భూవలయం మీదకు వచ్చినట్టుగా ఉండేవాడు. వాడు కట్టుకునే గుడ్డలు నల్లగా మాసి, అసహ్యంగా ఉండేవి. మాసిన తల, మాసిన గడ్డం – వాడు ఆరునెల్లకోసారి క్షౌరం చేయించుకునేవాడు. కాని వాడి భార్య... దానిపేరు రాధి అట... రాధి లక్ష్మయ్యను పూర్తిగా మార్చివేసింది. మొదటిసారిగా లక్ష్మయ్యలో జీవం తొణికిసలాడింది. తెల్లగా ఉతికిన బట్టలు కట్టు కుంటున్నాడు. వాడిలోని నిద్రమత్తు అమాయకత్వం అకస్మాత్తుగా అదృశ్యమయ్యాయి. చాలా హుషారుగా తిరగసాగాడు. రెండు మూడుసార్లు రాధితో సినిమాహాల్లో చూసాను వాడ్ని. రాధి భుజం మీద ధీమాగా చెయ్యివేసి సెకండ్‌క్లాస్‌లో కూర్చున్న వాడిని చూస్తే నాకు నిజంగా ఈర్ష్య కలిగింది. రాధికేసి పదేపదే చూస్తున్న వాడి కళ్ళల్లో గొప్ప గర్వం, గొప్ప సంతృప్తి వెలిగిపోయాయి. వాడి వాలకం చూస్తే వాడు రాధిని

ఆరాధిస్తున్నట్టు కన్పించాడు. ఎంత జడున్నైనా మనిషిని చేసే చాతుర్యం కేవలం స్త్రీకే ఉంది. అందులో రాధి... ఎలిజబెత్ టేలర్‌ని తలదన్నే రాధి!... వర్కింగు క్లాసులో తప్ప పుట్టిన రాధి!

రాధికోసం ఐదారు రాత్రులు విపరీతమైన విరహాన్ని అనుభవించాను. నరసింహం మాట నిలుపుకుంటాడని తెలుసు. వారం రోజులు తిరక్కుండానే రాధి నా బెడ్‌మీదకొచ్చింది. నరసింహం సామాన్యుడు కాడు. వందరూపాయల నోట్సు వాడి చేతిలోకి విసిరితే చాలు స్వర్గంలో ఉన్న రంభని నా బెడ్‌రూంలో దింపమంటే దింపుతాడు. నేను రాధిని గూర్చి వాడికి చెప్పిన తెల్లారినుండే ప్రయత్నం మొదలు పెట్టాడు. మా యింట్లోకి ఒక పనిమనిషి కావాలని, 15 రూపాయలదాకా జీతం యిస్తాడని. నీ పెళ్ళాన్ని ఎందుకు పనిమనిషిగా పంపించకూడదని. అది తెచ్చే జీతం నీ జీతానికి కలిపితే మీరు హాయిగా ఉండొచ్చని లక్ష్మయ్యకి సలహా యిచ్చాడు. లక్ష్మయ్య రాధి నడిగి చెప్తానన్నాడు. రాధి మా యింటికి పనిమనిషిగా రావటానికి ఒప్పుకుంది. వచ్చేసింది.

రాధి మొదట్లో చాలా బెట్టుచేసింది. “ఆడికి... మా మావకి... అన్నాయం చెయ్యలేను దొరా” అంది. “మీకీ పని తగదండి” హాయిగా పెండ్లి చేసేసుకోండి” అని సలహా యిచ్చింది. “ఆడు నన్ను ప్రాణంగా చూసుకుంటున్నా”డంది. నేను డబ్బు చూపెట్టాను. “టెర్లిన్ చీరలు కొనిస్తా”నన్నాను. “ఫుల్ వాయిల్ జాకెట్స్” కుట్టిస్తానన్నాను. వాడు హాయిగా ఉండటానికి కావలసిన డబ్బిస్తానన్నాను. “నేను కూడా నువ్వు లేంది బతకలే”నన్నాను. అంతే – రాధి లొంగిపోయింది!

రాధి అందంగా ఉండటమేకాదు... పుష్టిగా ఉండటమే కాదు– రాధి మన్మధున్ని కూడా చిత్తుచేసే నెరజాణ! నేను చాలామంది ఆడవాళ్ళను చూశాను. అనుభవించాను. కాని రాధి... కామునికి దేవి. ఈజ్ ఎ గాడెస్ ఆఫ్ సెక్స్. నన్ను రెచ్చగొట్టింది, మత్తెక్కించింది. ఊరించింది. అందకుండా తప్పించుకుంది. ఏడ్పించింది. నవ్వించింది. చివరకు తనను తాను యిచ్చేసుకుంది. నన్ను సంతృప్తి పరచింది. అలసి సొమ్మసిల్లిపోయేట్టు చేసింది రాధి. హాట్సాఫ్ టు హర్. నేనెన్నడూ ఊహించని మహోన్నత శిఖరాలని, మధుర లోకాల్ని నా స్వంతం చేసింది. విస్కి బాటిల్స్‌లా– సిగరెట్ ప్యాకెట్స్‌లా స్త్రీలను మార్చే నాకు రాధి లేకుండా ఒక్కక్షణమైనా బ్రతకగలనా అనిపించింది. జడుడిలాంటి లక్ష్మయ్యలో అంత జీవకళ, అంత చైతన్యం ఎలా ఉద్భవించాయో అర్థమయ్యింది.

రాధితో కలియడానికి నాకు పగలు తప్ప రాత్రి అవకాశం దొరికేది కాదు. లక్ష్మయ్య కౌగిట్లో వెచ్చగా పడుకొని వాడికి స్వర్గలోక మాధుర్యాలు చవిచూపుతున్న రాధిని జ్ఞాపకం చేసుకుంటే రాత్రంతా విపరీతమైన బాధతో నా శరీరం దహించుకు పోయేది. తెల్లవార్లూ విస్కీ బాటిల్స్ ఖాళీ చేస్తూ, సిగరెట్లు తగలేస్తూ గడిపేవాడిని.

నరసింహాన్ని అడిగాను 'రాధి విరహంలో రాత్రంతా కాలిపోతున్నా"నని. "ఎలాగైనా రాత్రుళ్లుకూడా రాధి నాకు కావా"లని. నరసింహం అఖండుడు ఆఫీసు పనేదో చెప్పి లక్ష్మయ్యను యేదో ఊరికి పంపించాడు. ఆ రాత్రి రాధి నా దగ్గరకొచ్చింది. అంటే - ప్రతీ రెండు రోజులకొకసారి నరసింహం లక్ష్మయ్యను యేదో ఊళ్ళకు పంపించటం మొదలెట్టాడు.

త్వరలోనే లక్ష్మయ్యకి అనుమానం కల్గినట్టుంది. వాడు ఊరికి వెళ్ళాడనుకొని ఆ రోజు రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో రాధి మా యింటికొచ్చింది. పదకొండు గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా మా బంగళా గేటుదగ్గర లక్ష్మయ్యమాట విన్పించి రాధి ఉలిక్కిపడ్డింది. లక్ష్మయ్య రంగడిని అడుగుతున్నాడు "మా రాధిటొచ్చిందా?"

"రాలేదు..." రంగడు.

"అరే రంగా! నిజం చెప్పరా... నాకంతా తెలిసిపోయిందిరా... మా గుడిసె చుట్టుపక్కల వాళ్లంతా చెప్పారు... దొంగ ల... యిక్కడే ఉంది"

"ఇక్కడ్లేదు లేరా... ఇంకెక్కడికైనా యెళ్లిందేమో"

"దొంగలంజెకొడుకా! నీ ప్రాణం తియ్యకపోతే..."

లక్ష్మయ్య - రంగడు పోట్లాడుకుంటున్న చప్పుడు. వెంటనే బయటకొచ్చాను. "ఆగండిరా!" అని కేకేసాను. లక్ష్మయ్య కోరగా నాకేసి చూసాడు. వాడికళ్లు చింత నిప్పుల్లా మండుతున్నాయి. వాడిని చూస్తే నాకు భయమేసింది.

"పేదవాళ్ళం సార్... డబ్బుకోసం గడ్డితింటామని తెలిసి మా జీవితాలతో చెలగాటమాట్టం న్యాయంగాదు సార్... మేమూ మనుషులమే... మాకూ నీతి నియమాలున్నాయి. హృదయాలున్నాయి... మీ కరెన్సీ నోట్లతో నా రాధిని మళ్ళీ రప్పించుకోవాలని చూసారో... నిన్ను చంపి నే చస్తాను"

వాడు దురుసుగా అన్నాడు. ఇంతలో మరో పక్కనుంచి రాధి వచ్చింది.

"దిక్కులేని దానవని చేరదీసానే... దొంగ లం... డబ్బుకాశపడి నాకింత అన్యాయం చేస్తావుటే... గుడిసెకు పా... నరికి పారేస్తాను"

రాధి తలవంచుకొని వాడి వెనకాల నడిచిపోయింది.

తెల్లారి రంగడ్ని అడిగాను. "నిన్న రాధిని లక్ష్మయ్య బాగా కొట్టాడా" అని. గుడిసెకు వెళ్ళగానే రెండు అంటించాడట తర్వాత యేడ్చాడుట. "నాకన్యాయం చెయ్యొద్దు... నువ్వు లేందే బతకలేను. నువ్వు ఆఫీసర్ దగ్గరకు మళ్ళోసారి యెళ్ళితే నేను ఉరేసుకుని సస్తానే. నా రెక్కలు యిర్చుకుని నీకు యేం కావాలంటే అది తెచ్చిస్తానే" అంటూ రాత్రంతా బతిమాలుతూనే ఉన్నాడట.

నాలుగైదు రోజులదాకా రాధి రాలేదు. నాకు పిచ్చెక్కినంత పనైంది. నరసింహంతో చెప్పాను. నరసింహం మళ్ళీ లక్ష్మయ్యకు యేదో డ్యూటీవేసి ఊరు వెళ్లమన్నాడు. ఈసారి లక్ష్మయ్య, నరసింహం మీద విరుచుకపడ్డాడు. నరసింహం యింటికెళ్ళి బూతులు తిట్టాడు. నరసింహం వచ్చి నాతో చెప్పుకున్నాడు.

"యేమన్నాడు వాడు" అడిగాను.

"నానా మాటలన్నాడు సార్. నా పెళ్లాం ముందు నా పరువు తీసేశాడు సార్. "డబ్బుకోసం గడ్డితినే కుక్కబతుకు నీది" అన్నాడు సార్... "నన్ను ఊరికెందుకు పొమ్మంటున్నావో తెలుసురా" అన్నాడు సార్. "అంత ఇష్టమయితే నీ పెళ్లాన్ని తీసికెళ్లి ఆఫీసర్ పక్కలో పండబెట్టుకోరాదూ" అన్నాడు సార్... వాడికి వెంటనే ఊస్టింగ్ ఆర్డర్స్ యివ్వకపోతే నా పరువు దక్కదుసార్" అన్నాడు నరసింహం.

ఆఫీసుకు వెళ్లటంతోటే లక్ష్మయ్యకు ఊస్టింగ్ ఆర్డర్స్ చేతికిచ్చాను. లక్ష్మయ్య వెంటనే నా రూంకి పరుగెత్తుకొచ్చాడు. యేడ్చాడు మొత్తుకున్నాడు. కాళ్లు పట్టుకున్నాడు.

"కడుపుమీద కొట్టకండి సార్... ఈ ఉద్యోగం పోతే బతకలేను సార్. పేదవాణ్ణి సార్... ఇంత అన్యాయం చేయకండి సార్" అన్నాడు.

నేను బ్లంట్‌గా అడిగాను.

"సరే... ఉద్యోగం యిస్తానుగాని, రాధిని నాకిస్తావా?" వాడు మండిపడ్డాడు. "ఛూ" అని నేలమీద ఉమ్మేశాడు.

"గెటౌట్" అని పెద్దగా అరిచాను.

"నీకింద నౌకరి చేసేదానికన్న – బిచ్చమెత్తుకుని బతుకుతాను" అన్నాడు.

"పోరా... బిచ్చమెత్తుకో పో" మళ్ళీ అరిచాను. స్ప్రింగ్‌డోర్స్ దభీమని బాది వాడు వెళ్ళిపోయాడు.

ఆరాత్రి, రంగడితో రాధికి కబురు పంపించాను. "లక్ష్మయ్యతో తెగదెంపులు చేసుకొని నా దగ్గరకు వచ్చేయ"మని, "జీవితాంతం ఉంచుకుంటా"నని. "మహారాణిలా పోషిస్తా"నని చెప్పమన్నాను. రంగడు వెళ్ళేటప్పటికి లక్ష్మయ్య గుడిసెలో లేడట. రంగడు రాధికి బాగా బోధించాడు.

"లక్ష్మయ్య ఉద్యోగం వూడింది. ఇద్దరూ బిచ్చమెత్తుకోవాల్సిందే - దొర దగ్గరకొచ్చావంటే జీవితాంతం సుఖపడ్తావు. డబ్బులో మునిగి తేలుతావు... వెంటనే వచ్చెయ్యి" ఇలా రంగడు పదేపదే చెప్పాడుట. మొదట్లో రాధి సందేహించింది. కాని రంగడి మాటలు విన్నాక దానివన్నీ సర్దుకొని మా ఇంటికొచ్చేసింది. విజయగర్వంతో విస్కీ బాటిల్ గడాగడా తాగేశాను.

ఆరాత్రికి లక్ష్మయ్య రాధిని వెతుక్కుంటూ మా బంగళాకొస్తాడని తెలుసు. అందుకే రంగడితో చెప్పాను. తగిన జాగ్రత్తలో ఉండమని. వాడికో 50 రూపాయలిస్తూ "మీ బలగాన్ని బాగా తయారుచేసి తీసుకురా. లక్ష్మయ్యగాడొచ్చి అల్లరి చేస్తే వాడి వళ్ళు హూనం చేసి పారేయండని - ఆర్డరిచ్చాను. రంగడు ఐదారుగురు దుక్కల్లాంటి వాళ్ళని పట్టుకొచ్చి గేటుదగ్గర కాపలా ఉన్నాడు.

అనుకున్నట్టుగానే రాత్రి పన్నెండు గంటల ప్రాంతంలో బాగా త్రాగి పెద్దగా అరుస్తూ లక్ష్మయ్య మా బంగళాకి వచ్చాడు. నా కౌగిట్లో పడుకున్న రాధి భయంతో లేవబోయింది.

"భయపడకు బయట రంగడు చూసుకుంటాడులే" అంటూ రాధిని యింకా దగ్గరకు అదుముకున్నాను.

బయట రంగడి కంఠం.

"అరే లచ్చిగా... మాటాడకుండా వెళ్ళిపోరా... పిచ్చిపిచ్చిగా అరిచావో సున్నంలోకి ఎముక మిగలదు"

"దొంగలంజకొడుక... కొడ్తావురా... నా పెళ్ళాన్ని నాకు కాకుండా చేత్తావురా..." లక్ష్మయ్య కంఠం. మరుక్షణంలో ధభేల్. ధభేల్మని లక్ష్మయ్య వంటిమీద పడ్తున్న దెబ్బల చప్పుడు... రాధి నాకింకా గట్టిగ హత్తుకుపోయింది. లక్ష్మయ్య బాధతో అరుస్తున్నాడు... అమ్మో... అయ్యో... చచ్చాన్రో... వామ్మో... వాయ్యో... రాధీ నన్ను చంపుతున్నారే... చంపేస్తున్నారే... వామ్మో... వాయ్యో...." లక్ష్మయ్య భయంకరంగా మూల్గాడు. నాక్కూడా భయమేసింది.

"అమ్మో" ఈసారి యింకా భయంకరంగా మూల్గాడు. దెబ్బ ఆయువుపట్టు మీద తగిలినట్టుంది. అంతే- నిశ్శబ్దం... స్పృహ తప్పిపోయుంటాడనుకున్నాను. పది నిమిషాల తర్వాత నా గదిబయట-

"సార్" అన్న రంగడి కేక- బయటకు వచ్చాను.

"యేమైంది?"

"బాగా తన్ని వాడి గుడిసెలో పడేసొచ్చాంసార్... నాలుగు రోజులదాకా లేవడు" -రంగడు.

"మంచిపని చేశారు... ఇక వెళ్ళిపొండి"

"మంచిది సార్" అంటూ రంగడు వెళ్ళిపోయాడు.

లోపలకెడ్తూ లక్ష్మయ్య గుడిసెకేసి చూసాను. అలాగే స్తంభించిపోయాను. లక్ష్మయ్య గుడిసెముందు పెద్దమంట... వాడి గుడిసెకెవరన్నా నిప్పుపెట్టారా?

"ఏమిట్రా ఆ మంట" రంగడ్ని కేకేసాను.

రంగడు "సార్" అంటూ పరుగెత్తుకుంటూ వచ్చాడు.

ఇంతలో ఆ మంట లక్ష్మయ్య గుడిసె ముందునుంచి కదిలింది. నా గుండెలు జలదరించాయి. లోపల ఎక్కడో వణుకు ప్రారంభమయింది. ఆ కదులుతున్న మంటలోంచి "అమ్మో అయ్యో" అంటున్న లక్ష్మయ్య భయంకరమయిన కేకలు నా గుండెల్ని కోసేసాయి. అటుకేసి బిత్తరపోయి చూస్తున్న రంగడన్నాడు.

"కొంపదీసి లచ్చిగాడు మీద గ్యాసునూనె పోసుకుని నిప్పంటించుకున్నాడా యేంది?"

రాధి బయటకొచ్చింది.

"అయ్యబాబోయ్... ఆడు గ్యాసునూనె పోసుకొని నిప్పుపెట్టుకున్నడు. ఇయ్యాళే సీసెడు గ్యాసునూనె కొనుక్కొచ్చి గుడిసెలో పెట్టేసిన. చచ్చావురా మావోయ్..."

రాధి యేడుపు లంకించుకుంది.

ఆ మంట యింకా కదిలింది... మంటలకి తాళలేక వెర్రిగా పరిగెత్తుతున్నాడు లక్ష్మయ్య. హృదయవిదారకంగా అరుస్తున్నాడు. కిందపడి అటూఇటూ దొర్లుతున్నాడు. తల కోసేసిన కోడిలా కొట్టుకుంటున్నాడు. "అమ్మో! అయ్యో!" అంటూ గుండెలు పగిలేలా మూల్గుతున్నాడు.

నా కాళ్ళూచేతులు విపరీతంగా వణకసాగాయి. శరీరమంతా చల్లబడి పోయింది. భయంతో గొంతంతా పూడుకుపోయింది. వెంటనే గదిలోకి వెళ్ళి విస్కీ బాటిల్ తీసాను. నాకు బాగా భయమేసినప్పుడు నాల్గు పెగ్గులు విస్కీ నోట్లో పోసుకుంటేగాని ఆ భయం పోదు. గబగబ విస్కీ నోట్లో పోసుకున్నాను. బయటినుండి లక్ష్మయ్య కేకలు యింకా భయంకరంగా నా గుండెల్ని తొలిచి వేస్తున్నాయి. సిగరెట్టు వెలిగించి బట్టలేసుకొని బయటకొచ్చాను. వెంటనే వెళ్ళిపోవాలి... లక్ష్మయ్య కేకల్ని అలాగే యింకాస్సేపు వింటే నాకు పిచ్చెక్కుతుంది. బయటకొచ్చాను.

మంటలారిపోయాయి. లక్ష్మయ్య వళ్లంతా కాల్చుకుని ఆ చీకట్లో ఎక్కడో పడిపోయి హృదయవిదారకంగా మూల్గుతున్నాడు. వాడి దగ్గరకు ఎవరూ వెళ్లటం లేదు. వాడి దగ్గరకు వెళ్లే గుండెలెవళ్ళకూ లేవు. జీపు బయటకు తీసాను. రాధి ఓ మూల కూర్చొని యేడుస్తోంది. రంగడు దాని పక్కనే కూర్చున్నాడు.

లక్ష్మయ్య మూల్గు తగ్గింది. యింకాస్సేపట్లో చచ్చిపోతాడు. 60 మైళ్ళ వేగంతో జీపు క్లబ్బువైపు మరలించాను.

క్లబ్బులో తెల్లవారేవరకు రమ్మీ ఆడుతూ కూర్చున్నాను. 500 రూపాయలు పోగొట్టుకున్నాను. మా ఫ్రెండ్స్ అన్నారు- అంత అబ్సెంట్ మైండెడ్‌గా ఆడుతున్నావేమిటని.

తెల్లారి ఎనిమిది గంటలకు పోలీసువాళ్ళొచ్చి లక్ష్మయ్య శవాన్ని వ్యాన్‌లో వేసుకుపోయారు. థాంగాడ్ అనుకున్నాను.

✧✧✧✧✧

– 'విద్యుల్లత' (మాసపత్రిక)